# ఈస్టర్ ఈవెనింగ్



-డేవిడ్ నిరీక్షణరావు కూరాకుల
CHAPLAIN, A.E.L. REVIVAL FORUM.

**ధ్యాన వాక్యభాగము : లూకా.24:13-35**

**"వారు సంభాషించుచు ఆలోచించుచుకొనుచుండగా, యేసు తానే దగ్గరకు వచ్చి వారితో కూడా నడిచెను" లూకా.24:15**

**1. సాదృశ్యము:** NDTV 24X7 అనే ఇంగ్లీషు న్యూస్ ఛానల్‌లో వారం వారం ప్రసారమయ్యే "WALK THE TALK" అనే కార్యక్రమం మంచి ప్రజాదరణ పొందింది. దీనిలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎడిటర్ శేఖర్ గుప్తా, ఆయా రంగాలలో గొప్ప గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తులతో సంభాషణను నడిపించడమే గాక, వారితో కూడా నడుస్తూనే సంభాషించడం జరుగుతుంది. TV-9 అనే తెలుగు వార్తా ఛానల్ కూడా 'క్లోజ్ ఎన్‌కౌంటర్స్' శీర్షికతో యిటువంటి కార్యక్రమాన్నే ప్రసారంచేస్తుంది. కుదురుగా కూర్చొని కాకుండా, స్వేచ్ఛగా, యుధాలాపంగా నడుస్తూ సంభాషను కొనసాగిస్తుంటే ఆయావ్యక్తుల అంతరంగాలలోని అనేక విషయాలు వారికీ, వీక్షకులకూ మరింత స్పష్టంగా అవగాహన అవుతాయి.

మేలైన అన్ని CONCEPTS కు పరిశుద్ధ గ్రంథమే మూలం అని ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన పనిలేదు. పునరుత్థాన దినపు సాయంకాలము ఎమ్మాయి (వేడి నీటి ఊట) గ్రామ మార్గములో నడుస్తూ సంభాషించుకొనుచున్న ఆ యిద్దరు శిష్యులను యేసుతానే సమీపించి వారితో నడుస్తూ, వారి సంభాషణను నడిపించడం గూర్చి ధ్యానించడం ఎంతైనా దీవెనకరం.

**2. సంక్షోభము** : తాము ఆశించింది, ఊహించిదేమిటి? తీరా జరిగిందేమిటి? "దేవుని యెదుటను, ప్రజలందరి యెదుటను క్రియలలోను, వాక్యములోను శక్తిగల ప్రవక్తయై యుండిన నజరేయుడగు యేసు ఇశ్రాయేలును విమోచించబోవువాడు (మెస్సియా / క్రీస్తు)''. (లూకా 24:19-22) అని ఎన్నో ఆశలు, ఊహలు పెట్టుకొని వుండే జరిగిందేమిటి? "ప్రధాన యాజకులు, అధికారులు ఆయనను మరణ శిక్షకు అప్పగించి సిలువ వేయించడం, నేటికి మూడు దినములు గడవడం జ్ఞాపకం చేసికొని వారు దుఃఖముఖులయ్యారు''. ఆ దినం ఉదయం " కొందరు స్త్రీలు సమాధియొద్దకు వెళ్ళి ఆయన దేహమును కానక వచ్చి - కొందరు దేవదూతలు తమకు కనబడి ఆయన బ్రదికియున్నాడని చెప్పినన్నూ, మరికొందరు శిష్యులు వెళ్ళి ఖాళీ సమాధిని చూచినను - పునరుత్థానుడైన ప్రభువు స్వయంగా కనబడనందున'' (లూకా 24:22-24) ఈ ఇద్దరు శిష్యులు తీవ్రమైన నిరాశ, నిస్ప్రుహ, మానసిక సంక్షోభంలో ఉన్నట్లు చూడగలం. ప్రభువును పరాజితునిగాను, ఇంకనూ మృతునిగానే వీరు ఎంచుకొంటున్నారు.

**3. సంభాషణ** : తనవారు తీవ్రమైన నిరాశ, నిస్ప్రుహలలో ఉంటే ప్రభువు చూస్తూ ఊరకుండగలడా? **"యేసు తానే దగ్గరకు వచ్చి"** అనే మాటలు మండుటెండల్లో చల్లని పానీయంలా ప్రాణాత్మలకు ఎంత హాయి నిస్తాయో ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. అయితే సమీపించిన ప్రభువును వారు గుర్తుపట్టలేకుండా వారి కన్నులు మూయబడెను (లూకా 24:16). ఎందుచేతనంటే వారి



ఆలోచనలను, తలంపులను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి యేసు వారికి అవకాశమిస్తున్నాడు. వారితో నడుస్తూ, వారి సంభాషణను చిన్న చిన్న ప్రశ్నలతో నడిపించాడు. తన బిడ్డల హృదయాలోచనలను / భయాందోళనలను, ఆరాధన - అభిలాషలను వినడానికి దేవుడెంతో యిష్టపడతాడు. **"యెహోవా యందు భయభక్తులు గలవారు ఒకరితో ఒకరు మాట్లాడుకొనుచుండగా యెహోవా చెవియొగ్గి ఆలకించెను"** (మలాకి 3:16). మనకు సందేహాలు / సమస్యలు / సంక్షోభాలు కలిగినప్పుడు మన తలంపులను ప్రార్ధనలో ఆయనకు వ్యక్తం చేయడానికి ప్రభువు అవకాశమిస్తాడు. అలా వ్యక్తం చేసినప్పుడే సమస్యలపట్ల స్పష్టమైన అవగాహన పొంది, సర్వశక్తుడైన దేవుని సహాయం మనకెంత అవసరమో సంపూర్ణంగా గ్రహించగలం. EXPRESSION DEEPENS IMPRESSION అనే సూత్రం అక్షరసత్యం.

**4. సాయంకాలము కావచ్చినది.... మాతోకూడా ఉండుము** : తాము వెళ్ళుచున్న గ్రామము దగ్గరకు వచ్చినప్పుడు ఆయన యింక కొంతదూరము వెళ్ళునట్లు అగపడగా వారు **"సాయంకాలము కావచ్చినది. ప్రొద్దుకుంకినది. మాతో కూడా ఉండుమని చెప్పి ఆయనను బలవంతము చేసిరి"** (లూకా. 24:29). ఎమ్మాయి మార్గములోని ఈ ఇద్దరి శిష్యుల అభ్యర్ధన ఆధారంగా **హెన్రీ ఫ్రాన్సిస్ లైట్** (HENRY FRANCIS LYTE) అనే జర్మన్ లూథరన్ పాస్టర్ గారు రచించిన శ్రేష్టమైన ఈ క్రింది సంగీతము / పాట ప్రపంచ వ్యాప్తంగా, ఆయాభాషలలో, ఒకే రాగంలో సాయంకాలారాధనలలోనూ ("VESPERS" - LATIN)పడకలకు వెళ్ళేముందు విశ్వాసులు పాడుకొనే ప్రార్ధనా గీతంగా ప్రసిద్ధి చెందింది.

"రాత్రియయ్యె నన్నొడబాయకు (56)
ధాత్రిపై చీకటులు గ్రమ్మెను
సహాయమేమి లేనివారికి
సహాయుడా నన్బాసిపోకుమీ''

ఇంగ్లీషులో "ABIDE WITH ME FAST FALLS THE EVENTIDE" అదే రాగంతోఆలపించబడుతుంది. నిన్ను సమీపించిన ప్రభువును నీవు స్వయంగా ఆహ్వానిస్తేనే తప్ప నీ గృహంలోనికి / హృదయంలోనికి రాడు, అని ఎమ్మాయి మార్గంలో నున్న శిష్యుల ఆహ్వానం తెలియజేస్తుంది. ఆ ఇద్దరిలో ఒకరి పేరు క్లెయొపా (లూకా24:18). రెండవ వ్యక్తి ఈ సువార్త వ్రాసిన లూకాయే అయి ఉండవచ్చునని ఎక్కువ మంది బైబిల్ పండితుల అభిప్రాయం. తన పేరుతానే ప్రస్తావించుకోవడం అనుచితమని భావించి పేరును వ్రాసుకోలేదని వారంటారు.

**5. సాక్షాత్కారము** : వారు తమ హృదయ వేదనను వ్యక్తం చేసిన పిదవ, పునరుత్థానుడైన యేసు వారిని గద్దించి, **"క్రీస్తు ఈలాగు శ్రమపడి, తన మహిమలో ప్రవేశించుట (పునరుత్థానుడగుట) ఆగత్యమని, మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను (లూకా.24:26,27,44)** ఆయన వారితో భోజనమునకు కూర్చునప్పుడు, ఒక రొట్టెను పట్టుకొని, స్తోత్రము చేసి దాని విరిచి వారికి పంచిపెట్టగా, వారి కన్నులు తెరువబడి ఆయనను గుర్తుపట్టిరి. అంతట ఆయన వారికి అదృశ్యుడాయెను. అప్పుడు వారు - "ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు

బోధపరచుచున్నప్పుడు (Expounding the scriptures) మన హృదయము మనలో మండుచుండ లేదా అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి (లూకా 24:30-32).

**6. సాక్ష్యము :** పునరుత్థానుడైన ప్రభుని ప్రత్యక్షతను గాంచిన ఆ ఇద్దరు ఎంతగా ప్రభావితులయ్యారో, ఎంతగా శక్తి పొందారంటే, ఆగడియలోనే వారు యెరూషలేమునకు తిరిగివచ్చి (రాత్రి భోజనము ముగించిన వారు, ఆ చీకటిలోనే తిరిగి ఎనిమిది మైళ్ళు నడిచి) త్రోవలో జరిగిన సంగతులను, ఆయన రొట్టె విరుచుట వలన తమకేలాగు తెలియబడెనో అదియు తెలియజేసిరి (లూకా 24:33-35).


**7. సహానుభవము :** ప్రియమైన పాఠకా! నీవు ఆశించింది జరగక, ఊహించిది నెరవేరక ఉన్నప్పుడు కూడా **'నిన్ను ఏ మాత్రమును విడునను, నిన్ను ఎన్నడును ఎడబయాను'** (హెబ్రీ 15:5బి) అని వాగ్దానం చేసిన ప్రభువు ఎంతైనా నమ్మదగినవాడని మరువద్దు. ఆయన తానే నిన్ను సమీపిస్తాడు. నీవు ఆయనను గుర్తించలేనప్పటికిని ప్రార్ధనలో ఆయనతో ప్రయాణించు. నీ భయాందోళనలను ఆయనతో సంభాషించు, లేఖనాల ద్వారా ఆయన నీకు బోధిస్తాడు, రొట్టె (వాక్యము) విరిచి (విభజించి) నప్పుడు నీవు ఆయనను ఆత్మలో చూడగలవు. ఆ వాక్యము బోధించబడేటపుడు **"నీ హృదయం నీలో మండే"** శ్రేష్ఠమైన అనుభూతి ఆయన ప్రత్యక్షతను నీకు రుజువుచేస్తుంది. నీకు సాక్ష్యంగా మిగులుతుంది.

సందేహంలో, సంక్షోభంలో ఎమ్మాయి మార్గస్థులతో సహానుభవం కలిగియున్న నీవు వారి వలె స్తుతిలో, సాక్ష్యంలో సహానుభవం పొందు!

**పునరుత్థానుడైన ప్రభువు మిమ్ము్మను దీవించుగాక!**

ఆ వచనాలు ఎందుకు

# స్వరం తగ్గించి పాడతాం?



-డేవిడ్ నిరీక్షణరావు కూరాకుల
CHAPLAIN, A.E.L. REVIVAL FORUM.

ధ్యానవాక్యము : **"నీవు నాకుమారుడవు నేడు నిన్ను కనియున్నాను".**

**" కుమారుని ముద్దుపెట్టుకొనుడి, లేనియెడల ఆయన కోపించును. అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు. ఆయనను ఆశ్రయించు వారందరు ధన్యులు".** -కీర్తన 2:7, 12

**1. ప్రస్తావన :** మన లూథరన్ సంఘ ఆదివారపు ఆరాధన క్రమంలో పాడే **'కలుగును గాక దేవునికి మహిమ'** అనే స్తుతి గీతంలో **"ఏక కుమార యేసు ప్రభువా......"**అనే వచనం, **"లోక పాపములు మోసికొని పోవు...."** అనే వచనం పాడే సమయంలో, అప్పటి వరకు గంభీర స్వరంలో పాడే పాస్టర్‌గారు మరియు సంఘమంతయు ఈరెండు వచనాలు ఎందుకు స్వరం తగ్గించి పాడతారు? అదేవిధంగా, ఆయా ప్రార్థనా సమావేశాల ప్రారంభంలో కాని, గృహ ప్రవేశపుటారాధన ప్రారంభంలో కాని పాడే **"రండి యుత్సాహించి పాడుదుము"** అనే పాటలో **"ఆ ప్రభు సన్నిధి మోకరించి...."** అనే వచనం కూడా స్వరం తగ్గించి పాడతాం. మన కీర్తనల పుస్తకాలలో ఈ వచనాలు చిన్న అక్షరాల్లో ముద్రింపబడి వుండి, వీటిని స్వరం తగ్గించి పాడమన్నట్లుగా సూచిస్తూంటాయి. అయితే ఈ వచనాలు ఎందుకు స్వరం తగ్గించి పాడతాం?. ఇది మనందరికి ఎప్పుడో ఒకప్పుడు తప్పక కలిగే ప్రశ్న. దాదాపు జవాబు లేనట్లుగా ఉన్న ప్రశ్న. తరతరాలుగా యాంత్రికంగా చేసే ఈ ప్రక్రియ వెనుక ఉన్న ఇతి వృత్తాన్ని పరిశీలిద్దాం.

**2. పునరుత్థాన (ఈస్టర్) దినం – ప్రతి ఆదివారము ఒక పునరుత్థాన దినమే :**

పై ప్రశ్నకు జవాబు మన ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానముతో పెనవేసుకున్న వైనం తెలిసికొనడం ఎంతైనా ఆశీర్వాదకరం! కేవలం గుడ్‌ఫ్రైడే తరువాత వచ్చే ఆదివారము మాత్రమే పునరుత్థాన (ఈస్టర్) దినం కాదు. నిజానికి సంవత్సరంలో వచ్చే మొత్తం 52 ఆదివారాలు పునరుత్థాన పండుగ దినాలే. ఈస్టర్ దినానికి ప్రతీకలే. అందువలననే ఒక మండలం కాలంపాటు (40 దినాలు) జరుపబడే శ్రమలకాల ధ్యానాలు భస్మ బుధవారం నాడు ప్రారంభమై ఈస్టర్ ముందురోజైన పరిశుద్దవారంలోని శనివారం వరకు - నిజానికి ఇవి 46 దినాలు - అయితే మధ్యలో వచ్చే ఆరు ఆదివారాలు లెంట్‌కాలంలో లెక్కించరు. ఎందుకంటే అవి పండుగ దినాలే కాని శ్రమల దినాలు కావు గనుక. ఆలాగైతేనే 46 వరుస దినాలలోని 40 లెంటు దినాల లెక్క సరిపోతుంది.

**3. క్రీస్తు యేసు పునరుత్థానం – ఆయన పరలోక పట్టాభిషేక దినం :**

హెబ్రి పత్రిక 1:5,6 లలో **"పాపముల విషయంలో శుద్ధీకరణ తానే చేసి** (సిలువలో రక్తం చిందించి, ప్రాణం పెట్టి, మృతిని గెల్చిలేచిన యేసయ్య)... **ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను. ఏలయనగా నీవు నా కుమారుడవు, నేడు నేను నిన్ను**



**కనియున్నాను"** అని తండ్రి చెప్పినట్లుగా చూడగలం.

రోమా పత్రిక 1:5లో **"యేసు క్రీస్తు శరీరమును (శరీరధారియగుటను) బట్టి దావీదు సంతానముగాను, మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను (దేవునిగాను) ప్రభావముతో నిరూపింపబడెను".** (రోమా పత్రిక మొదటి అధ్యాయము మొదటి పేరాలోని 11-13 పంక్తులు).

అపో.కా 13:32, లలో **"దేవుడు యేసును లేపి... నీవు నాకుమారుడవు. నేడు నేను నిన్ను కంటిని అని రెండవ కీర్తన యందు వ్రాయబడియున్నది"** అని తెలియజేస్తూ ఈ రెఫరెన్సుల కన్నిటికి మూలమైన కీర్తన గ్రంథములోని అధ్యాయపు సంఖ్యతో పాటు పాత నిబంధన ప్రవచనమైన కీర్తన 2:7 ఉటంకిపబడినట్లు చదువుతాం. అన్నట్టు 2వ కీర్తనను, 95వ కీర్తనను దావీదే వ్రాశాడని క్రొత్తనిబంధనలోనే మనకు తెలుస్తుంది. (అపో.కా 4:25-26, హెబ్రి 4:7).

సాతానుని ఓడించి, మరణమును జయించిన కుమారుని తండ్రియైన దేవుడు అభినందిస్తూ **"ఇప్పుడు నిజముగా నా కుమారుడవయ్యావు! నా సింహాసనమును అధిరోహించి నా తరపున రాజ్యపాలన చేయి"** అన్నట్లుగా (implied) ఈ మాటలను అవగాహన చేసికోగలం.

ఫిలిప్పి 2:5-14లో **"........క్రీస్తు యేసు మరణం పొందునంతగా, అనగా సిలువ మరణం పొందునంతగా తన్నుతాను తగ్గించుకొన్నాడు. కాబట్టి దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెనని"** చూడగలం. ఆ **'పైనామమే'** యేసుక్రీస్తు **'ప్రభువు'** అనే నామం/ బిరుదం. పునరుత్థానానికి ముందు బైబిల్ యేసయ్యను కేవలం **యేసుక్రీస్తు** అని మాత్రమే ఉదహరిస్తే, పునరుత్థానానికి తర్వాత **ప్రభువైన యేసుక్రీస్తు** అని సంబోధిస్తుంది.

**శరీరధారి** అగుటవల్ల యేసు **మానవునిగా** నిరూపింపబడ్డాడు.
**సిలువ మరణం** పొందుట వల్ల యేసు **రక్షకునిగా** నిరూపింపబడ్డాడు.
**పునరుత్థానుడగుట** వల్ల యేసు **ప్రభువుగా** నిరూపింపబడ్డాడు.

**4. రక్షణకు సూత్రం (Salvation Formula) – ప్రభువైన యేసు నామం :**

**"యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెనని, నీ హృదయము నందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు"** -రోమా 10:9

(**గమనిక :** 'యేసు ప్రభువని' చదివేటప్పుడు ఆరెండు పదాల మధ్య కొద్ది విరామం ఇచ్చి చదవాలి.)

**"ప్రభువు నామమున ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును"** -రోమా 10:13

**5. "కుమారుని ముద్దుపెట్టుకొనుడి లేనియెడల ..... మీరు నశించెదరు" :**

కీర్తన 2:12లో పరిశుద్ధాత్ముడు లోకానికి యిలా హెచ్చరిస్తున్నాడు. **"సింహాసనాసీనుడైన (కీర్తన 2:6,7) ప్రభువైన యేసుక్రీస్తును ముద్దుపెట్టుకొనుడి, లేనియెడల ఆయన కోపించును... మీరు నశించెదరు."** "ముద్దు పెట్టుకొనుడి'' అని వ్రాయబడిన ఈ మాటకు మూల హెబ్రి భాషాపదం 'NASHAQ'. ఈ సందర్భంలో ఆపదానికి 'ఆయన ఎదుట సాగిలపడి ఆయన పాదములను ముద్దుపెట్టుకొనుడి అనే అర్థం యివ్వబడింది.

**6. స్వరం తగ్గించి పాడడానికి కారణం ఇదే :**

కేవలం ఈలోక సంబంధమైన ఒక చిన్న అధికారి దగ్గరకు సమీపించినప్పుడే నెమ్మదిగా, స్వరం తగ్గించి మాట్లాడే మనం, తండ్రి కుడి పార్శ్వమున **ప్రభువుగా** సింహాసనాసీనుడైన క్రీస్తు యేసు సన్నిధిలో ఎంత భయభక్తులతో, వినయవిధేయతలతో, శ్రద్ధాశక్తులతో ఉండాలో, ఆయనచే పాలింపబడే వారముగా ఆయన కనికరమును (దయ/MERCY) వేడుకోవాలో స్ఫురణకు తెచ్చే ప్రక్రియగా ఉండాలని మన సంఘపితురులు ఈ విధి విధానమునేర్పాటు చేశారు. ఈ వచనాలను చిన్న సైజులో ప్రింట్ చేశారు.

**7. పై వివరణ వెలుగులో ఇప్పుడు ఈ వచనాలను గమనించండి, గానం చేయండి :**

★ ఏకకుమారా- **యేసు ప్రభువా** - యెహోవా తనయా-లోకపాపము మోయు ఏకదేవుని గొర్రెపిల్ల మమ్మును **కనికరించుము** చల్లగా.


★ లోకపాపమును మోసుకుపోవు - యేసు రక్షకా - **వాసిగ జనకుని కుడివైపున గూర్చుండి** - యేసు మాప్రార్ధనాలించి - **కనికరించు.** ॥కలుగును॥

★ **ఆ ప్రభు సన్నిధి మోకరించి** - ఆయన ముందర **మ్రొక్కెదము.** ఆయన మాటలు గైకొనిన అయ్యవి మనకెంతో మేలగును. ॥రండి యుత్సాహించి॥

**దేవుడు మిమ్మును దీవించునుగాక!**

**మీరు మీ వాహనాన్ని యమస్పీడుగా నడుపుతారా!**

**అయితే ఈ పాటలు నేర్చుకోండి మరి!**





| వేగం / కి.మీ | | పాట |
|---|---|---|
| 45 | -- | దేవుడే నాకాశ్రయంబు, దివ్యమైన దుర్గము |
| 60 | -- | నేను వెళ్ళే మార్గము నాయేసుకే తెలియును |
| 70 | -- | ఇదిగో దేవా! నా జీవితం, ఆపాద మస్తకం నీ కంకితం |
| 80 | -- | ఉన్నపాటున వచ్చుచున్నాను నీపాద సన్నిధికి |
| 90 | -- | పరదేశులమో ప్రియులారా! మనపురమిది గాదిప్పుడు |
| 100 | -- | రవికాంతిని మించినదౌ ఒక దేశము దూరమున |

**"నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము" 2 తిమోతి 4:5**

**సేకరణ:**

**డేవిడ్ నిరీక్షణరావు కూరాకుల**